చక్రతీర్థస్నానం.. రథోత్సవం



స్వామివారి పుష్కరిణిలో చక్రతీర్థస్నానం చేయిస్తున్న వేదపండితులు

చందానగర్: చందానగర్‌లోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న వేంకటేశ్వరస్వామి ఏకోనత్రింశ 29వ బ్రహ్మోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం 7.30 గంటల నుంచి 9.30 వరకు నిత్యోపాశనం, పూర్ణాహుతి, ఉత్సవాన్తస్నపనం, 10గంటల నుంచి 11గంటల వరకు శ్రీస్వామివారి పుష్కరిణిలో చక్రతీర్థస్నానం, ధ్వజారోహణం, స్వామివారి శేష వస్త్రములు వేలం, మధ్యాహ్నం 12గంటలకు హారతి, తీర్థ ప్రసాదములు, సాయంత్రం 7గంటల నుంచి మేలతాళాలతో, బాణసంచాతో రథోత్సవం, రాత్రి 9గంటలకు హారతి, తీర్థప్రసాదములు అందించారు. ఈ శ్రీవారి చక్రతీర్థస్నానం, రథోత్సవంలో వాడవాడల నుంచి భారీ సంఖ్యలో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కోల్‌కతాలో మర్డర్...
చార్మినార్‌లో షెల్టర్!

అక్కడి ఆనందాపూర్ పరిధిలో బడా వ్యాపారి హత్య

- జూలైలో ఘాతుకానికి ఒడిగట్టిన ముగ్గురు నిందితులు
- ఆపై నగరానికి వచ్చి చార్మినార్ ప్రాంతంలో ఆశ్రయం
- కేసు దర్యాప్తులో గుర్తించిన పశ్చిమ బెంగాల్ పోలీసులు
- చార్జ్‌షీట్‌లో నగరానికి చెందిన ఎండీ షేక్ నౌషాద్ పేరు
- అరెస్టు కోసం హైదరాబాద్ చేరుకున్న ప్రత్యేక బృందం





హతుడు ఆరిఫ్ (ఫైల్)

సాక్షి, సిటీబ్యూరో: పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో సంచలనం సృష్టించిన బడా వ్యాపారి ఆరిఫ్ ఖాన్ హత్య కేసు లింకులు నగరంలో వెలుగు చూశాయి. అతడిని హతమార్చిన నిందితులు నేరుగా సిటీకి వచ్చి చార్మినార్ ప్రాంతంలో ఆశ్రయం పొందినట్లు అక్కడి పోలీసులు గుర్తించారు. ఈ కేసులో శుక్రవారం ఆనందాపూర్ కోర్టులో దాఖలు చేసిన అభియోగపత్రాల్లో ఈ విషయం పొందుపరిచారు. ఈ నేపథ్యంలోనే నిందితుల జాబితాలో నగరానికి చెందిన మహ్మద్ షేక్ నౌషాద్ పేరునూ చేర్చారు. అతడి కోసం గాలిస్తూ ఓ ప్రత్యేక బృందం హైదరాబాద్‌కు చేరుకుంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం...

స్నేహితుడే పగబట్టి..

కోల్‌కతా శివారులోని పంచన్నగ్రామ్ ప్రాంతానికి చెందిన ఆరిఫ్ ఖాన్, మోయిన్ అబ్బాస్ స్నేహితులు. గతంలో ఇద్దరూ చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ బతికారు. ఇరు కుటుంబాల మధ్యా మంచి సంబంధాలు ఉండేవి. కొన్నేళ్ల క్రితం ఆరిఫ్ ఖాన్ రియల్ ఎస్టేట్, కన్‌స్ట్రక్షన్ వ్యాపారం ప్రారంభించి కోల్‌కతాలోనే ప్రముఖ వ్యాపారవేత్తల్లో ఒకరిగా పేరు తెచ్చుకున్నారు. అబ్బాస్ మాత్రం ఆనందాపూర్ ప్రాంతంలో రౌడీగా మారి హఫ్తాలు వసూలు చేయడం మొదలెట్టాడు. ఇందులో భాగంగా తరచూ ఆరిఫ్ ఖాన్ నుంచి డబ్బులు డిమాండ్ చేసి వసూలు చేసేవాడు. నగదు ఇచ్చే ప్రతి సందర్భంలోనూ ప్రవర్తన మార్చుకోవాల్సిందిగా అబ్బాస్‌కు ఆరిఫ్ ఖాన్ హితబోధ చేస్తూ వచ్చాడు. ఇతడి ప్రవర్తనతో విసిగిపోయిన అబ్బాస్ డబ్బులు ఇవ్వడం మానేశాడు.

మరో ఇద్దరు స్నేహితులతో కలిసి...

తాను ఎంతగా డిమాండ్ చేస్తున్నా, బెదిరిస్తున్నా ఆరిఫ్ ఖాన్ డబ్బులు ఇవ్వకపోవడాన్ని అబ్బాస్ జీర్ణించుకోలేకపోయాడు. ఓ సందర్భంలో ఆరిఫ్ బహిరంగంగా తనను మందలించడంతో అబ్బాస్ కోపంతో రగిలిపోయాడు. ఒకప్పుడు తనతో పాటు చిన్న ఉద్యోగం చేసిన ఆరిఫ్ ఇప్పుడు బడా వ్యాపారిగా మారడంతో అప్పటికే ఈర్ష్యతో రగిలిపోతున్న అబ్బాస్ కోపానికి ఇది ఆజ్యం పోయినట్లయ్యింది. ఆరిఫ్‌ను వదిలేస్తే అతడి మాదిరిగానే మరికొందరు వ్యాపారులూ హఫ్తా ఇవ్వడం మానేస్తారని, ఆ ప్రాంతంలో తన ఆధిపత్యం దెబ్బతింటుందని అబ్బాస్ భావించాడు. దీనికి ఆరిఫ్‌ను బహిరంగంగా, నడిరోడ్డుపై హత్య చేయడమే పరిష్కారమని నిర్ణయించుకున్నాడు. దీనికోసం తన స్నేహితులైన మహ్మద్ జహీర్ ఖాన్, అమీర్‌బకర్‌లతో కలిసి రంగంలోకి దిగాడు.

హత్య తర్వాత నగరానికి వచ్చి...

ఆరిఫ్‌ను హత్య చేయడం కోసం దాదాపు రెండు నెలల పాటు వేచి చూసిన ఈ త్రయం... ఈ ఏడాది జూలై 26న సాయంత్రం ఆనందాపూర్ ప్రాంతంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఆరిఫ్‌ను అడ్డగించిన వీరు ముగ్గురూ ఘర్షణకు దిగారు. ఆపై అతడిని వెంటాడి దారుణంగా హత్య చేశారు. హత్యానంతరం ముగ్గురిలో ఇద్దరు ముంబై పారిపోగా.. అబ్బాస్ మాత్రం చార్మినార్ ప్రాంతంలో నివసించే తన సమీప బంధువు మహ్మద్ షేక్ నౌషాద్‌ను సంప్రదించాడు. హత్య విషయం అతడికి చెప్పి... తనకు ఆశ్రయం ఇవ్వాలని కోరారు. నౌషాద్ అంగీకరించడంతో సిటీకి వచ్చిన అబ్బాస్ అతడి వద్ద ఆశ్రయం పొందాడు. హత్య జరిగిన మూడో రోజు నగరానికి వచ్చిన కోల్‌కతా పోలీసులు అబ్బాస్‌ను, ముంబైలో మిగిలిన ఇద్దరినీ అరెస్టు చేసి తీసుకువెళ్లారు.

అభియోగపత్రాల్లో నౌషాద్ పేరు...

అప్పట్లో కోల్‌కతా పోలీసులు నౌషాద్‌ను అరెస్టు చేయలేదు. హత్య విషయం తెలియకపోవడంతో అబ్బాస్‌కు ఆశ్రయం ఇచ్చి ఉంటాడని భావించారు. అయితే అబ్బాస్‌ను కోర్టు అనుమతితో పోలీసు కస్టడీలోకి తీసుకుని విచారించగా అన్నీ తెలిసే నౌషాద్ ఇతడికి ఆశ్రయం ఇచ్చినట్లు వెలుగులోకి వచ్చింది. దీంతో అక్కడి కోర్టులో దాఖలు చేసిన అభియోగపత్రాల్లో నౌషాద్‌ను నాలుగో నిందితుడిగా చేర్చారు. 100 పేజీల ఈ చార్జ్‌షీట్‌లో 48 మందిని సాక్షులుగానూ చేర్చారు. నౌషాద్‌ను అరెస్టు చేయడానికి ఓ ప్రత్యేక బృందం ఆదివారం నగరానికి చేరుకుంది. అతడి ఆచూకీ లేకపోవడంతో ముమ్మరంగా గాలిస్తోంది.

రైల్లో బంగారు ఆభరణాలు చోరీ

కాచిగూడ: రైల్లో ప్రయాణిస్తున్న ఓ మహిళ బంగారు ఆభరణాలు చోరీకి గురైన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఎల్‌బీనగర్‌కు చెందిన నాగేశ్వర్ రావు భార్య రత్నకుమారి శనివారం బెంగళూర్ - యశ్వంత్‌పూర్ రైలులో బయలుదేరి ఆదివారం ఉదయం కాచిగూడకు చేరుకుంది. స్టేషన్‌లో లిఫ్ట్ వద్ద ఆమె బ్యాగులోని 15 గ్రాముల బంగారు అభరణాలు, రూ.1,900 నగదు చోరీకి గురైనట్లు గుర్తించిన ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌లో బ్యాగ్ మాయం

కాచిగూడ: రైల్లో ప్రయాణిస్తున్న ఓ మహిళ బ్యాగులో నుంచి బంగారు ఉంగరం, నగదు చోరీపై కాచిగూడ రైల్వే పోలీసులు జీరోఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప కథనం మేరకు మల్కాజ్‌గిరికి చెందిన స్వప్న కుటుంబంతో సహా తిరుపతి వెళ్లి శనివారం వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ రైల్లో తిరుగు ప్రయాణమయ్యాయి. రైలు మహబూబ్‌నగర్ స్టేషన్ వద్దకు రాగానే ఆమె బ్యాగు చోరీకి గురైంది. బ్యాగులో బంగారు ఉంగరం, రూ.3వేల నగదు ఉన్నట్లు బాధితురాలు ఆదివారం కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు తదుపరి విచారణ నిమిత్తం మహబూబ్‌నగర్ రైల్వే పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

అయ్యప్పస్వాములకు మిరియాల పాల వితరణ



గంగారంలో మిరియాల పాల వితరణ చేస్తున్న దాత కేపీ శ్రీనివాస్, ప్రసాదరావు

చందానగర్: చందానగర్ గంగారంలోని జగద్రక్షక శ్రీ ధర్మశాస్తా అయ్యప్ప స్వామి దేవాలయంలో ఆదివారం భారీగా అయ్యప్పస్వాములు మాలాధారణ తీసుకున్నారు. ఈ సందర్భంగా ప్రసాదరావు గురుస్వామి మాట్లాడుతూ.. రాబోయే మండల దీక్ష కోసం ఒక్కరోజే 100 మంది అయ్యప్ప స్వాములు మాలాధారణ తీసుకొని దీక్షను ప్రారంభించారన్నారు. శ్రీ జగద్రక్షక శ్రీ ధర్మశాస్తా అయ్యప్పస్వామి దేవాలయంలో మధ్యాహ్నం నిత్యం అన్నదానం, సాయంత్రం అల్పాహారంతో పాటు నూతనంగా కేపీ శ్రీనివాస్ అయ్యప్పస్వాములకు మిరియాల పాల వితరణ చేపట్టారు. అయ్యప్ప స్వాములకు 2025 జనవరి 4వ తేదీ వరకు నిత్య అన్నదానం, అల్పాహారం, మిరియాల పాల వితరణ ఉంటుందన్నారు.

థిల్లాన.. థిల్లాన.!



మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమంలో భాగంగా ఆదివారం బెంగళూరుకు చెందిన భరతనాట్య కళాకారిణి భూమిక గౌడ నాట్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఆనందనర్తన గణపతిం, శృంగారలహరి కీర్తన, అష్టపది, థిల్లాన.. థిల్లాన నృత్య ప్రదర్శన అలరించింది. శ్రీసిద్ధ కృష్ణ కూచిపూడి డ్యాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ గురువు సుజాతామూర్తి శిష్యబృందం గాయత్రి, లలిత, సుభద్ర, తాన్యా, శాన్వి, లక్ష్మి, అధ్య కళాకారులు గణేశ పంచరత్న, అంబాష్టకం, స్వాగతం కృష్ణ, శంకరశ్రీకరి, ధనశ్రీ థిల్లాన, మంగళం తదితర అంశాలను ప్రదర్శించారు.



సమాజసేవలో శ్రీకృష్ణా యూత్ ముందుంటుంది



శిబిరాన్ని ప్రారంభించిన జగదీశ్వర్‌గౌడ్‌తో శ్రీకృష్ణయూత్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అభిషేక్‌గౌడ్

రాయదుర్గం: సమాజ సేవలో శ్రీకృష్ణా యూత్ ఎప్పుడూ ముందుంటుందని శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని గౌలిదొడ్డిలో అపోలో ఆస్పత్రి సహకారం శ్రీకృష్ణా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి, వైద్య శిబిరాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. సమాజంలో ఎంతో మంది వ్యాధులను గుర్తించలేక వైద్యానికి దూరమవుతూ అనేక రోగాల బారినపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి పేద, మధ్య తరగతి ప్రజలకు ఆస్పత్రికి వెళ్లలేని వారికోసం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. శ్రీకృష్ణయూత్ అసోసియేషన్ ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించడం హర్షణీయమని అన్నారు. భవిష్యత్తులోనూ మరిన్ని ప్రాంతాల్లో సేవాకార్యక్రమాలు నిర్వహించాలని ఆయన సూచించారు. అంతకుముందు అపోలో వైద్య బృందం స్థానికులకు వైద్య పరీక్షలు చేసి మందులను అందజేశారు. శ్రీకృష్ణయూత్ రాష్ట్ర అధ్యక్షుడు అభిషేక్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు సురేందర్, అనీల్, రోహిత్‌గౌడ్, విజయభాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఆదిత్యముదిరాజ్, హన్మంతు, సతీష్‌చారి, శివానందరెడ్డి, ప్రతీష్‌యాదవ్, కిరణ్, అంకుష్, సాయినాథ్, గోపాల్, సంగమేష్, దేవేందర్, ముర్తజా పాల్గొన్నారు.

రోడ్డు గతుకుల మయం.!




శేరిలింగంపల్లి: ఇటీవల కురుస్తున్న వర్షాలకు ప్రధాన రోడ్లు అధ్వానంగా మారాయి. చందానగర్ డివిజన్ పరిధిలోని లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి పీజేఆర్ స్టేడియానికి వెళ్లే రోడ్డులోని సిటిజన్ కాలనీ వద్ద గతుకుల మయంగా మారింది. దీంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా ఉదయం చందానగర్ నుంచి గచ్చిబౌలి వైపు వెళ్లే ఉద్యోగులతో ఆ రోడ్డు బీజీగా ఉంటుంది. దీంతో ఆ రోడ్డులో గోతులు ఎక్కడ ఉన్నాయో తెలియక వాహనదారులు అసౌకర్యానికి గురవుతున్నారు. సాయంత్రం వేళలో కూడా ఇదే మార్గం అంతే రద్దీగా ఉండటంతో ప్రయాణం ఇబ్బందిగా మారుతోంది. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ అధికారులు రోడ్డు నిర్మాణానికి వెంటనే చర్యలు తీసుకోవాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు 11 కేవీ ఏపీహెచ్‌బీ, జయభేరి ఎన్‌క్లేవ్ ఫీడర్ల పరిధిలో ఏపీహెచ్‌బీ కాలనీ, జయభేరి ఎన్‌క్లేవ్, బొటానికా తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేడు గోపన్‌పల్లిలో బీజేపీ సభ్యత్వ నమోదు

రాయదుర్గం: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సోమవారం గచ్చిబౌలి డివిజన్ గోపన్‌పల్లిలో నిర్వహించనున్నట్లు కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి తెలిపారు. గోపన్‌పల్లిలోని బీజేపీ కార్పొరేటర్ కార్యాలయంలో ఉదయం 10గంటలకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో గచ్చిబౌలి నేతలు కార్యకర్తలు విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.


ఆయన చూపే పేదవాడికి వెన్నల వెలుగు...
ఆయన నవ్వే బీదవాడికి కొండంత అండ ఆయన మనసే అభాగ్యులకి భరోసా...
రాష్ట్ర సమాచార, రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి
జన హృదయ నేత
శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారికి
జన్మదిన శుభాకాంక్షలు
మువ్వా విజయ్ బాబు
ఆర్. రఘురాం రెడ్డి
ఖమ్మం పార్లమెంటు సభ్యుడు
శ్రీ రఘునాథ్ యాదవ్
కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు
శేరిలింగంపల్లి నియోజకవర్గం